# నేహాల



సాయి బ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 8

**వడి వడిగా అడుగులు** వేసుకుంటూ ఉమాదేవి మందిరం వైపుగా వెళ్ళాడు నరేంద్ర గజపతి.

తమ రాజ్యంపై దండెత్తి తన తండ్రితో యుద్ధం చేసి సంధి కుదుర్చుకున్న దేవరాయలు తన అక్క ఉమాదేవిని పెండ్లాడాడు. తన తండ్రీ ప్రజల క్షేమమూ, సంతోషమూ ఆశించి ఈ పెళ్ళికి ఆమోద ముద్ర వేశాడు. మొదట నుండీ నరేంద్ర గజపతికి ఈ వివాహం ఇష్టం లేదు. కూతుర్నిచ్చి తన తండ్రి గజపతుల జుట్టుని దేవరాయల చేతిలో పెట్టినట్లుగా భావించాడు. దేవరాయలకున్న రాజ్య కాంక్ష జగద్విదితం. అతనెలా గద్దె ఎక్కాడన్నదీ అందరికీ తెలుసు. గజపతులతో ముందు ముందు ఏమైనా తేడా వస్తే దేవరాయలు ఉమాదేవిని చంపడానిక్కూడా వెనుకాడడన్న భయంతో అక్కకి సాయంగా వచ్చాడు నరేంద్ర గజపతి. ఉమాదేవితో వివాహమయ్యి ఇంకా ఏడాది కూడా కాలేదు. ఇంతలోనే మరో వివాహానికి సిద్ధపడుతున్నాడన్న కోపం పెరిగిపోయింది. ఉమాదేవి వచ్చాక దేవరాయలు మొదటి ముగ్గురు భార్యలూ కేవలం రాణులుగానే మిగిలిపోయారు. అంతఃపురాలకే వాళ్ళ జీవితాలు అంకితమయిపోయాయన్నది అతను గమనిస్తూనే ఉన్నాడు. పెళ్ళయిన కొత్త మోజు వల్లనేమో ఉమాదేవి మందిరంలోనే ఎక్కువ రోజులు గడుపుతాడు. దేవరాయల చర్యలనీ వెయ్యి కళ్ళతో గమనిస్తూనే ఉంటాడు.

దేవరాయలు స్త్రీలోలుడన్న విషయం అతనికి తెలుసు. ఒక్క దేవరాయలేంటి తన తండ్రీ అంతే! ఆయన అన్నదమ్ములందరిదీ అదే తీరు. తనకి చిన్నతనం నుండీ ఇవన్నీ తెలుసు. అందువల్ల దేవరాయలు స్త్రీలోలుడన్న విషయం అతనికి కొత్తగా అనిపించలేదు. రాజు తల్చుకుంటే వెలయాల్ని మహారాణిగా చెయ్యగలరు. మహారాణులకి వెలనూ కట్టగలరు. అధికారానికున్న శక్తటువంటింది. స్వేచ్ఛకి అధికారం ఆయువుపట్టు లాంటిది. విజయాన్నీ, విధ్వంసాన్నీ ఎగదోసేది అదే! అందునా దేవరాయలు విజయనగర సామ్రాజ్య నేత. అడిగేవాడూ ఉండడు. అడిగినవాడూ మిగలడు.

పెద్ద భార్యకి రామచంద్ర రాయలనే పద్దెనిమిదేళ్ళ కొడుకూ, అతనికి వయసులో ఏడాది చిన్నయిన మంజరీ అనే కూతురూ ఉంది. రామచంద్ర రాయలు వయసుకు మించిన భోగలాలసలో జీవిస్తూ ఉంటాడు. దేవరాయలూ వాళ్ళని అంతగా పట్టించుకోడు. రామచంద్ర రాయల్ని చూస్తే ఎక్కడా మహారాజు కొడుకు అన్న భావనే కలగదు. రెండో రాణికీ వీర విజయుడనే పదేళ్ళ కొడుకున్నాడు. వాళ్ళదీ అదే పరిస్థితి. భోగాలూ, సౌకర్యాలూ, పరిచారికలూ అంతే వాళ్ళ జీవితం. దేవరాయల్ని ఎదురుపడి ఇదేమిటని ప్రశ్నించరు. నోరువిప్పే ధైర్యమూ లేదు. ఒకవేళ అడిగినా దేవరాయలు వీళ్ళని ఖాతరు చెయ్యడనీ వారికి తెలుసు.

దేవరాయలు మిగతా భార్యల్ని పట్టించుకోడన్న సంగతి తెలుసు. పెద్ద భార్య కూతురు మంజరికి పెళ్ళి చేద్దామన్న ధ్యాస కూడా దేవరాయలకి లేదన్న సంగతి నరేంద్ర గజపతికి తెలుసు. అందంలో ఓ మాదిరిగా ఉన్నా, ఆమెను ఎలాగయినా వివాహం చేసుకుంటే తను రాజకీయం చేసి విజయనగర సింహాసనం అధిష్టించవచ్చన్న లోచన వుంది నరేంద్ర గజపతికి. ఎప్పటికయినా విజయనగర రాజ్యాన్ని హస్తగతం చేసుకోవాలన్నదే అతని ధ్యేయం. అదే లక్ష్యంతో ఉమాదేవి తోడుగా విజయనగర గడ్డపై అడుగెట్టాడు. విజయనగరంలో

అణువణువూ తెలుసుకోవాలి. వీళ్ళ శక్తినీ, పాలనా పద్ధతుల్నీ, సైనిక బలగాన్నీ, యుద్ధతంత్రాన్నీ పూర్తిగా అవగాహన చేసుకోవాలి. అంతవరకూ తను సంయమనం పాటిస్తూ వచ్చాడు. సమయం చూసి దెబ్బ కొట్టాలన్నదే అతని వ్యూహం. ఈలోగా ఒకవేళ ఉమాదేవికి కొడుకు పుట్టినా తనకొచ్చే ఇబ్బంది లేదు. మేనళ్ళుణ్ణి అడ్డుపెట్టుకొని వ్యవహారం చక్కగా నడపచ్చని అతని ఉద్దేశ్యం. ప్రస్తుతం ఉమాదేవికి సంతానం పుట్టడం మాట దేవుడెరుగు. మరలా ఇంకో పెళ్ళికి సిద్ధమవుతున్నాడంటే ఇందులో ఏదో తిరకాసుంది. ఇంత హుటాహుటిన ఒకమ్మాయిని కనులారా చూడకుండానే వివాహానికి సిద్ధపడుతున్నాడంటే రెండే రెండు కారణాలుండాలి. ఒకటి ఆమె అతిలోక సుందరయినా అయ్యుండాలి. లేదా ఏదైనా రాజకీయ ప్రయోజనమైనా ఉండాలి. అందమైన కన్యలు కావాలంటే విజయనగరంలో చాలా మందే దొరుకుతారు. కాబట్టి మొదటికారణం అయ్యుండకపోవచ్చు. దీర్ఘంగా ఆలోచిస్తే రాజకీయ కారణమే నన్న అనుమానం నరేంద్ర గజపతికి బలపడుతోంది. మరీ అంత ప్రత్యేకంగా ముద్గల్లో ఉన్న ఒక సామాన్య కుటుంబీకుడి కూతుర్ని హఠాత్తుగా వివాహం చేసుకోడానికి సిద్ధపడుతున్నాడంటే దీని వెనుక చాలా కుట ఉండిఉండచ్చు. పైకి కనిపించేది మాత్రం వివాహమొక్కటే! వెనుక ఏదో పెద్ద వ్యూహమే ఉండి ఉంటుంది. అదెలాగయినా ఉమాదేవి ద్వారా రాబట్టించాలి. అలాగే ఈ వార్తనీ ఆమె చెవిన వేసి రాబోయే ముప్పుని చూపిస్తూ హెచ్చరించాలి. లేదంటే తమ ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశముంది.

మరో రాణి వస్తే ఉమాదేవీ మిగతా రాణుల మాదిరిగానే అవుతుంది. అంతఃపురానికే బందీ అవుతుంది. మహారాణికాస్తా మాజీగా మిగులుతుంది. ఉమాదేవితో పాటే తనూ రాచగౌరవం కోల్పోవాల్సి వస్తుంది.. ఉమాదేవితో పాటు తనకీ ఏ మాత్రం ప్రాముఖ్యతుండదు. ఇదంతా తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తోంది. ఎలాగయినా ఈ పెళ్ళి ఆపించాలి. ఉమాదేవికి రాబోయే అవాంతరాన్ని చెప్పి ముందుగానే హెచ్చరించాలి.

దేవరాయల వివాహాన్నెలా తిప్పికొట్టాలా అన్న వ్యూహం ఆలోచిస్తూ ఉమాదేవి మందిరం వైపుగా వెళ్ళాడు నరేంద్ర గజపతి. అప్పటికే చీకటి పడుతోంది. మందిరం బయట పరిచారికలు దీపాలు వెలిగిస్తున్నారు.

ఖిన్నవదనుడై వేగంగా మందిరంలోకి వెళుతున్న నరేంద్ర గజపతిని చూసి పరిచారికలు ఆశ్చర్యపోయారు. వాళ్ళకేసి ముఖమెత్తి చూడ లేదు. అతని విచారవనం చూసి కాస్త కంగారు పడ్డారు. జరగకూడనిదేదో జరిగిందన్న అనుమానం వచ్చింది.

సాధారణంగా ఉమాదేవి మందిరంలో నరేంద్ర గజపతిని ఎవరూ అడ్డుకోరు. దేవరాయలూ, నరేంద్ర గజపతే అంత స్వేచ్ఛగా వెళతారు.

ఆ సమయంలో ఉమాదేవి సంగీత గోష్టి జరుపుతోంది. ఎవరో పాడుతున్నారు. ఉమాదేవి తన్మయత్వంతో వింటోంది. విసురుగా వచ్చిన నరేంద్ర గజపతిని చూసి ఒక్కసారి కళ్ళు తెరిచి చూసింది. అతని అడుగుల శబ్దానికి పాడే వ్యక్తి ఒక్కసారి పాట ఆపేసింది. అందరూ ఆశ్చర్యంతో ఏమయ్యిందన్నట్లు చూసారు. ఉమాదేవి కంగారుగా తమ్ముడి కేసి చూసింది.

"ఉమా! కొంపలంటుకున్నాయి. నీతో ప్రత్యేకంగా మాట్లాడాలి. పద లోపలికెళదాం." ఉమాదేవి సమాధానం కేసి చూడకుండానే ఆమె పడక గది వైపుగా వెళ్ళాడు. కూర్చున్న చోటునుండి ఒక్కసారి లేచి, సంగీత విద్వాంసుల్ని వెళ్ళమన్నట్లుగా సౌంజ్ఞ చేస్తూ తమ్ముణ్ణి అనుసరించింది ఉమాదేవి. ఆమెకు విషయమేమీ అర్థం కాలేదు.

ఆమె లోపలికి అడుగు పెట్టగానే చివాలునెళ్ళి తలుపులు బంధించాడు.

"అక్కా! ఘోరం జరిగిపోతోంది. ఎలాగయినా నువ్వే ఆపాలి!" మొహంలో ఉద్రిక్తతా, విచారమూ తమ్ముడిమాటల్లో స్పష్టంగా ధ్వనిస్తున్నాయి.

ఏమయ్యిందని ప్రశ్నించింది. నరేంద్ర గజపతి మొత్తం పూస గుచ్చినట్లు చెప్పాడు. సావధానంగా వింది. ముందు మాట రాలేదు. నమ్మడానికి మనస్కరించలేదు. ఎందుకంటే తనతో చెప్పకుండా ఇప్పటివరకూ దేవరాయలేమీ చెయ్యలేదు. చెయ్యడన్న నమ్మకమూ

తనకుంది. అప్పుడప్పుడు పరస్త్రీలపై వ్యామోహం చూపించినా అది వివాహం వరకూ వెళ్ళదని తెలుసు. అర్థాంతరంగా ఈ వివాహం ఏమిటి? ఓ క్షణం ఆమెకేమీ అర్థం కాలేదు. విషయం నింపాదిగా అర్థమయ్యాక ఆలోచనలో పడిపోయింది.

"అయితే ఏం చెయ్యాలంటావు?" ఆమెకేమీ తోచడం లేదు.

"విషయం తెలిసిన నాకూ ఏం చెయ్యాలో అర్థం కాలేదు. నా అంతట నేనుగా విన్నాను. అక్కడే ఉండి అన్నీ విన్న భటుడూ నా మాటల్నీ, అనుమానాన్నీ బలపరిచాడు. నేను విన్నదీ, వింటూన్నదీ నిజమేనని నిర్థారించాడు. అందుకే నీ దగ్గరికి పరిగెత్తుకొచ్చాను. నువ్వెలాగయినా మహారాజు నుండి విషయం రాబట్టాలి..."

నరేంద్ర గజపతికి ఏం చెయ్యాలో పాలుపోడం లేదు.

"అలాగే! విషయం పూర్తిగా తెలిసే వరకూ మనం కాస్త ఓపిక పట్టాలి. ఏమీ తెలియనట్లే నటించాలి. తెలిసి మనం బయట పడద్దు. నువ్వు కూడా అప్రమత్తంగా ఉండు. ప్రతీ ఒక్కర్నీ వెయ్యి కళ్ళతో గమనించు. ఈలోగా నేను మహారాజు వద్ద కూపీ లాగుతాను. అంతవరకూ మనం తెలివిగా వ్యవహరించాలి..." ఉమాదేవి మెల్లగా అంది.

తమ్ముడి కన్నా ముందుగా ఉమాదేవే తేరుకుంది.

"అలాగే అక్కా! నా బాధల్లా ఒకటే! మరో రాణి వస్తే నీకూ, మిగతా రాణులకీ తేడా ఏమీ ఉండదు. మననెవరూ ఇక్కడ పట్టించుకోరు..."

తమ్ముడి ఆంతర్యం అర్థమయ్యింది. వయసులోనే కాదు వ్యవహారంలోనూ ఆమే పెద్ద.

"కంగారు పడకు. మన కాస్త తెలివిగా వ్యవహరించాలి. మహారాజు ఈ రాత్రికొచ్చినప్పుడు మెల్లగా కదిపి చూస్తాను. కూపీ లాగడానికి యధాశక్తి ప్రయత్నిస్తాను..ఇంతకీ  ఆ వూరేమన్నావు?"

"ముద్గల్!  ఆ అమ్మాయి వేదరాయ శర్మ శిష్యురాలట. చాలా అందంగా ఉంటుందట. అందంగా ఉంటే అనుభవించమను. ఎవరు కాదన్నారు? ఎంతో మందితో మహారాజు.."

"తమ్ముడూ.." అని చికాగ్గా అంటూ నరేంద్రగజపతి ఆవేశానికి అడ్డుతగిలింది ఉమాదేవి.

"నువ్వనవసరంగా ఉద్రేకపడకు. ఈ పెళ్ళి నాకూ జీవిత సమస్యే! నేనూ అంత సులభంగా వదిలిపెట్టను. ఒక్క విషయం గుర్తు పెట్టుకో! ఆవేశపడి మనం ఏమీ చెయ్యలేం. మనకిక్కడ స్థాన బలం లేదు. ముందు నువ్వు  వేదరాయశర్మ దగ్గరకెళ్ళి విషయాలు సేకరించు...ఈ పెళ్ళికి ఎవరు సూత్రధారులో కనుక్కో!"

అక్కగారి మాటలు విని కాస్త నిదాన పడ్డాడు.

" ఆ అమ్మాయికి వర్తమానం పంపడానికి వేదరాయ శర్మ వెళ్ళడం లేదు. ఈ పని భూషణా చార్యుడికప్పగించారన్నదే నేను విన్నాను. శిష్యురాలి పెళ్ళి విషయం వేదరాయశర్మని కాకుండా మధ్యలో ఈ భూషణాచార్యుణ్ణి పంపుతున్నారంటే నాకేదో అనుమానంగా వుంది. అయినా ఈలోగా నేనూ వివరం కనుక్కుంటాను. నువ్వూ మహారాజు ద్వారా మరింత సమాచారం తెలుసుకో! దాన్ని బట్టి మనం ఏం చెయ్యాలో ఆలోచిద్దాం. మరలా రేపొద్దున్న వస్తాను. ఈ రాత్రికి భూషణాచార్యుణ్ణి కలవడానికి ప్రయత్నిస్తాను..."

తమ్ముడి చెప్పిన దానికి సరేనంది ఉమాదేవి.

ఉమాదేవి నుండి నరేంద్ర గజపతి శలవు తీసుకున్నాడు.

పైకి గంభీరంగా ఉన్నా ఉమాదేవీ లోపల ఆలోచనలతో సతమవుతోంది. మహారాజు ఎప్పుడు వస్తాడాని ఎదురు చూస్తోంది.

ఆలోచన్ల వేగం పెరిగితే క్షణాలు ఒక్కడుగు కూడా ముందుకెళ్ళవు.

మనసూ, కాలమూ స్థంభించిపోయింది ఉమాదేవికి.

00000000000000

అక్కడ గుల్బర్గాలో కొత్త కోట నిర్మాణ కార్యక్రమాల్లో తలమునకలై ఉన్నాడు అహ్మద్‌ఖాన్. ఎంతో గోప్యంగా మూడోకంటికి తెలియకుండా పనులు కానిస్తున్నాడు. ఎంతో విశ్వాసపాత్రులయిన వాళ్ళని ఈ పనిలోకి తీసుకున్నాడు. భీమనది కాలువ తవ్వకం పేరున పైకి వ్యవహారం కనిపించినా అంతర్గతంగా జరిగేది మరొకటి. ఎవరికీ ఏ రకమయిన అనుమానం రాకుండా జాగ్రత్త పడుతున్నాడు. భీమనది కాలువ పనులూ చురుగ్గా సాగుతున్నాయి. అంతే వేగంగా ఫిరోజాబాదు కోట నిర్మాణం కూడా జరుగుతోంది. భీమనది ఒడ్డున ఒక విహార భవనం కడుతున్నట్లుగానే ప్రచారం చెయ్యసాగాడు. ముఖ్యంగా గిసుదరాజ్‌కే మాత్రం అనుమానమూ రాకుండా భీమనది కాలువ ప్రారంభం యన చేతి మీదుగానే ప్రారంభించాడు. సందర్భంగా ప్రత్యేకమైన సత్కారాలతో గిసుదరాజ్‌ని గౌరవించాడు. ఫిరోజ్‌షా, అహ్మద్‌ఖాన్ల సయోధ్యా, పాలనా వ్యవహారమూ గిసుదరాజ్‌కెంతో నచ్చాయి. ఒక్కోసారి యుద్ధాలు అనివార్యమయినా, తమంతట తాము యుద్ధాలని ఆహ్వానించకూడదని ఒకటికి రెండు సార్లు మాట తీసుకున్నాడు గిసుదరాజ్. అందరిముందూ అలాగేనన్నా అహ్మద్‌ఖాన్ గమ్యం వేరు. ఎప్పటికయినా దేవరాయల్ని దెబ్బతీయాలి; ఆఖరికి అయినవాళ్ళని మట్టుపెట్టయినా సరే! ప్రతీకారానికి వివేకమూ, విచక్షణా ఉండదు. దానికి అహ్మద్ ఖానే నిలువెత్తు సాక్ష్యం.

00000000000000

ఉమాదేవి మందిరం నుండి సరాసరి తన భవనానికొచ్చాడు నరేంద్ర గజపతి. వచ్చీ రాగానే భూషణాచార్యుడెక్కడ నివసిస్తాడో వివరాలు సేకరించాడు. రాత్రికి రాత్రే భూషణాచార్యుడి ఇంటికి వెళ్ళడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. ఎలాగయినా భూషణాచార్యుడి ప్రయాణం ఆపాలన్నదే అతని ధ్యేయం. నయాన్నో, భయాన్నో ఇది గుట్టుచప్పుడు కాకుండా కానివ్వాలి. భోజనానంతరం వ్యాహ్యాళికన్న నెపంతో గుర్రమ్మీద బయల్దేరాడు నరేంద్రగజపతి. అతనికి తోడుగా మరో ఇద్దరు సేవకులూ బయల్దేరారు. తమనెవరూ గమనించకుండా జాగ్రత్త పడ్డాడు నరేంద్ర గజపతి. ఊరంతా నిద్రపోయే సమయానికి భూషణాచార్యుడి ఇంటిని సమీపించాడు. కిటికీలోంచి దీపం వెలుతురు స్పష్టంగా కనిపిస్తోంది. అంటే భూషణాచార్యుడు ఇంకా నిద్రకుపక్రమించ లేదని గ్రహించాడు.

సేవకుల్ని ముందు పంపించాడు. వాళ్ళు ఇంటి తలుపు కొట్టారు.

"ఎవరూ?" అంటూ తలుపు తీస్తూ సైనికుల్ని చూసి ఆశ్చర్యపోయాడు భూషణాచార్యుడు.

"మీరు..?" అప్రయత్నంగా అన్నాడు.

"భయం లేదు. మీరు బయటకి రండి. మహారాజుగారు పంపారు. మిమ్మల్ని కలవాలని నరేంద్ర గజపతి విచ్చేసారు."

ఇది విన్నాక భూషణాచార్యుడికి అనుమానం పోయి, బయటకి వచ్చాడు. దూరంగా గుర్రం పక్కన ఒక వ్యక్తి కనిపించాడు. సేవకుల్ని అనుసరిస్తూ అటుగా వెళ్ళాడు భూషణా చార్యుడు.

నరేంద్ర గజపతిని చూస్తూనే నమస్కరించాడు.

"ఇంత రాత్రి వేళ మీరు.. కబురంపిస్తే నేనే విచ్చేసేవాణ్ణి కదా రాజా?"

"అత్యంత రహస్యమైన పనొచ్చి పడింది మీతో! అందుకనే మేం విచ్చేసాం." అంటూ సాయంత్రం దేవరాయల సంగీత భవనంలో జరిగినదంతా తెలుసుకున్నాడు.

భూషణాచార్యుడు చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు. ముద్గల్లో వేదరాయశర్మ శిష్యురాల్ని వివాహ నిమిత్తమై భూషణా చార్యుణ్ణి రెండుదినాల్లోల్లో పంపడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలుసుకున్నాడు. మెల్లగా తనొచ్చిన వైనం చెప్ప సాగేడు.

"భూషణా చార్యా! మీరు ముద్గల్ ప్రయాణం ఆపుకోవాలి. వెళ్ళడానికి మహారాణి ఉమాదేవి ఒప్పడం లేదు. ఆమె మాటగా చెప్పడానికొచ్చాను. మీరు ఏం చేస్తారో తెలీదు. ఈ ప్రయాణం చెయ్యలేనని మీ అంతట మీరు మహారాజుకి చెప్పాలి. మా మాట కాదంటే మీ కుటుంబం మొత్తం బ్రతకరు. మేం చెప్పినట్లు చేస్తే ఎవరికీ తెలియ కుండా మీకు కొంత ధనం ముట్ట చెబుతాం. మీరు చెయ్యలేనని వెను తిరిగినా, మేమెచ్చినట్లు మహారాజుకి తెలియ పరిచినా మీకు ఎల్లుండి తెల్లారదు.."

ఎంతో కర్కశంగా వినిపించాయా మాటలు భూషణాచార్యుడికి.

విషయం అర్థమయ్యింది. మౌనంగా విన్నాడు. వెళ్ళకపోతే మహారాజు దండిస్తాడు. వెళితే మహారాణి దండిస్తుంది. ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా వుంది పరిస్థితి.

దేవరాయల్ని ఎలాగయినా ఒప్పించచ్చు. నరేంద్రగజపతి తన ప్రాణాలకీ, కుటుంబానికీ కత్తి చూపిస్తున్నాడు. బ్రతికితే బలుసాకు తిని బ్రతకచ్చు. తన మూలంగా కుటుంబ సభ్యుల ప్రాణాలకు హాని కలిగించడానికి మనస్కరించలేదతనికి. మెల్లగా తన నిర్ణయం చెప్పాడు.

"మహారాజా! మీరు చెప్పినట్లుగానే ప్రయాణం మానుకుంటాను. మహారాజు మరీ పట్టుబడితే ఏం చెయ్యమంటారో మీరే చెప్పండి? సామాన్యులు రాజుతో తగవు పెట్టుకున్నా, రాజే సామాన్యుడితో తగవులాడినా నష్టపోయేది సామాన్యుడే! భయంగా ఉంది..ఏం చెయ్య మంటారు..?"

"మీకు అనారోగ్యం చేసిందనీ, ముద్గల్ వెళ్ళలేరనీ కబురు పంపండి. రాత్రికి రాత్రి విష జ్వరం వచ్చిందని చెప్పండి. కావాలంటే - ఆస్థాన వైద్యులెవరో ఒకరిచేత అవునని చెప్పిస్తాం. మీరు కదల్లేని పరిస్థితుల్లో వున్నారని కబురు పంపండి చాలు. తరువాత మహారాణి చూసుకుంటారు."

ఏం చెయ్యాలో స్పష్టంగా చెప్పాడు నరేంద్ర గజపతి. అంతా విని సరే నన్నాడు భూషణాచార్యుడు. విష జ్వరం వచ్చిందని తెల్లారేక కొడుకు చేత కబురంపడానికే నిశ్చయించుకున్నాడు. అది తప్ప అతనికి గత్యంతరం లేదు.

ఒకటికి రెండుసార్లు భయం రూపంలో హెచ్చరించి నరేంద్రగజపతి బయల్దేరడానికి సిద్ధమయ్యాడు. ప్రస్తుతానికి ఒక అడ్డు తొలగించగలిగానని సంతోషంగా వెనుదిరిగాడు నరేంద్ర గజపతి.

ఇంటిలోపలికొచ్చి కుటుంబానికి విషయం చెప్పాడు భూషణాచార్యుడు.

కష్టాలూ, ఉపద్రవాలూ ఎవరికీ చెప్పి రావు. వాటిని సాదరంగా హ్వానించి ధైర్యంతోనే సాగనంపాలి. అంతకుమించి గత్యంతరం కనిపించలేదు భూషణాచార్యుడికి.

000000000000000

తమ్ముడు తెచ్చిన వార్త విన్నాక అన్నం సయించలేదు ఉమాదేవికి. గాయపడ్డ లేడిలా కుదురులేక గదంతా తిరుగుతూనే వుంది. దేవరాయలు ఇంకా రాలేదు. ఒక్కోసారి రాత్రి భోజనానికి ఉమాదేవి మందిరానికే వస్తాడు. రాచకార్యాలు తెమలకపోతే విందు ఏర్పాట్లు అక్కడే జరుగుతాయి. ఒక్కోసారి ఆలస్యంగా వస్తాడు. అతనికోసం ఎదురు చూడదు. ఆలస్యముంటే ముందుగానే కబురొస్తుంది. ఈరోజు అలాంటిదేమీ లేదు. అంటే ఎప్పటివేళకే వచ్చే అవకాశముంది. తనకే క్షణాలు భారంగా నడుస్తున్నాయి. దేవరాయల రాక కోసం ఎదురుచూస్తూనే వుంది. మహారాజు రాగానే ఎలా విషయం రాబాట్టాలాన్నదానికి తనలో తను తెగ సతమతమవుతోంది.

పొద్దుపోయాక దేవరాయలు వచ్చాడు. ఎప్పటిలాగే ఉమాదేవి సాదరంగా ఎదురెళ్ళి ఆహ్వానించింది. మనసులో అగ్నిపర్వతాలు రగులుతున్నా ప్రవర్తనలో ప్రేమ కురిపిస్తూనే ఉంది. మెల్లగా మాటల్లోకి దించింది. పక్కమీదకు చేరి గోముగా ఆ కబురూ, ఈ కబురూ చెప్పింది. ఎన్ని విషయాలు మాట్లాడినా దేవరాయలు తను చేసుకోబోయే పెళ్ళి ప్రయత్నం గురించి ప్రస్తావనే తీసుకు రావడం లేదు. ఉమాదేవిలో సహనం నశిస్తోంది. ఉగ్గపెట్టుకొని సంయమనం పాటిస్తోంది.

ఎంతకీ దేవరాయలు పెళ్ళి విషయం ఎత్తకపోయే సరికి ఆపుకోలేక తనే అంది.

"ఏంటి మహారాజా? ఈ రోజంతా సంగీత మందిరంలోనే గడిపారని సేవకులు చెప్పారు. ఏంటి విశేషం? ఎవరైనా విద్వాంసులొచ్చారా?" ఏమీ తెలియనట్లుగానే అంది.

"ప్రత్యేకంగా ఎవరూ రాలేదు. ముద్గల్ నుండి వేదరాయశర్మ వచ్చారు కదా? ఆయనతో నృత్యశాస్త్రం గురించి చర్చిస్తూ అక్కడే ఉండిపోయాం. అంతే!" దేవరాయలు అంతకు మించి చెప్పలేదు.

విషయం దాస్తున్నాడని ఉమాదేవికర్థమయ్యింది. చూస్తూంటే దేవరాయలు తనతో చెప్పడు కాక చెప్పడు అని తీర్మానించుకున్నాక అసలు విషయం బయటకు లాగింది.

"వేదరాయ శర్మ శిష్యుడు ఎవరో అమ్మాయి చిత్రపటం అద్భుతంగా వేసాడని విన్నాను. నిజమేనా?"

"ఓ అదా! అవును. వేదరాయశర్మ దగ్గర నేహల అని ఒకమ్మాయి నృత్యం నేర్చుకుంటుందట. చాలా అందంగా ఉంటుందనీ, నాట్యం చేస్తుందనీ చెబితే విజయనగరంలో ఆ మె నాట్య ప్రదర్శన ఏర్పాటు చేద్దామని అనుకుంటూండగా, ఆయనతో వచ్చిన శిష్యుడు - ఆమె చిత్రపటం గీసి చూపించాడు. అంతే!"

ఉమాదేవికి ఒళ్ళు మండింది. అసలు విషయం చెప్పకుండా తెలివిగా దేవరాయలు దాటవేస్తున్నాడని అర్థమయ్యింది..

"అలాగా? అతని శిష్యుడు ఒక్క పూటలో చిత్రపటం వేసేసాడా? ఆశ్చర్యంగా ఉందే?"

నటనలో ఆమె దేవరాయలకేమీ తక్కువ కాదు.

"ఒక్కరోజులో ఏమీ వెయ్యలేదు. క్రితంసారి కలిసినప్పుడామ్మాయి ప్రస్తావన వస్తే వేదరాయశర్మ అమ్మాయి సౌందర్యాన్ని తెగ వర్ణిస్తుంటే చూడాలని అనుకున్నాను. అక్కడే ఉన్న శిష్యుడు బొమ్మేసి చూపిస్తానన్నాడు. ఇదిగో ఇవాళ చిత్రపటం గీసిచ్చాడు."

"అలాగా! అయితే ఆ అమ్మాయిని ఇక్కడికి రప్పిస్తున్నారా?" అంటూండగా మధ్యలో తనకేసి చూసిన దేవరాయల ముఖకవళికలు గమనించి - "అదే. నాట్య ప్రదర్శనకి..?" అంటూ సర్దుకుంటూ అంది ఉమాదేవి.

గుచ్చి గుచ్చి అడగడంతో దేవరాయలకనుమానం వచ్చింది. కొంపతీసి విషయమంతా తెలియలేదు కదా? అయినా ఎవరు చెబుతారీ విషయం? అక్కడున్నది వేదరాయశర్మా, శిష్యుడూ, భూషణాచార్యుడూ. వీళ్ళందరూ తనతో పాటే పొద్దుపోయే వరకూ ఉన్నారు. వాళ్ళు చెప్పే అవకాశం లేదు. మరి ఎవరు ఈ వార్త చెప్పుంటారు?

ఉమాదేవికెవరో ఈ విషయం చెప్పుండాలి. అందుకే ఆమె పట్టి పట్టి అడుగుతోంది. దేవరాయలు పెళ్ళి విషయమూ చెప్పదలుచుకోలేదు.

"ప్రదర్శన ఏర్పాటు చెయ్యమని వేదరాయశర్మ గారికి చాలాసార్లు చెప్పాను. ఆ అమ్మాయి పదిమంది ముందూ ప్రదర్శనివ్వడానికి ఒప్పుకోదట. అందుకని ఆమెకు కానుకలు ఇచ్చి ఆహ్వానించమని చెప్పాను..." దేవరాయలు నిజం చెప్పదలుచుకోలేదు. అందువల్ల అనర్థలొస్తాయని తెలుసు.

"ఓ అలాగా! కానుకలు ఎవరి చేత పంపిస్తున్నారు?.."

దేవరాయలకి ఉమాదేవి ఆరాలు చూస్తే చికాకు కలిగింది.

"భూషణాచార్యుడు రాయచూరు వైపు పనిమీద వెళుతున్నానంటే ఆయన చేతే పంపిద్దామని నిర్ణయించారు. వేదరాయశర్మగారయితే ఆమె ఒప్పుకోదని చెప్పారు. అందుకని.."

దేవరాయలు నిజం చెప్పడం లేదన్నది అర్థమయ్యింది ఉమాదేవికి. సత్యాసత్యాల మధ్య భార్యా భర్తల దొంగాట ఆడుతున్నారు. ఇద్దరూ తేలుకుట్టిన దొంగలే! ఇహ విషయం పొడిగించ దల్చుకోలేదు. సమయం చూసి పట్టుకోవాలి. ఎలాగూ రేపటికి తన తమ్ముడు పూర్తిగా విషయం సేకరిస్తాడు.

రేపు అతనితో చర్చించాక ఏం చెయ్యాలో ఆలోచించ వచ్చని నిర్ణయించుకుంది.

వేరే కబుర్లలోకి దింపింది. లోపల వేదన రగులుతున్నా పైకి మాత్రం నవ్వుతూనే రాత్రి గడిపింది. ఉమాదేవి పక్కనే ఉన్నా చిత్రపటంలో చూసిన నేహలే గుర్తుకొస్తోంది దేవరాయలకి. నేహల చిత్రపటం అతని మనసులో బాగా నాటుకుపోయింది. అందానికి మోహితులు కాని వారెవరుంటారు; ముఖ్యంగా మహారాజులు.

దేవరాయలు సుఖనిద్రలోకి జారుకున్నా ఆమెకి మాత్రం కంటి మీద కునుకు లేదు.

పలు ఆలోచన్లతో సతమత మవుతూ ఉమాదేవి భారంగానే గడిపిందారాత్రి.

0000000000000

నరేంద్ర గజపతికి మాటిచ్చిన ప్రకారం ఆ మర్నాడు భూషణాచార్యుడు తనకి విషజ్వరం సోకిందంటూ కొడుకు చేత దేవరాయలకి కబురంపాడు. అతను వెళ్ళేసరికి దేవరాయలు ఆస్థానంలో ఉన్నాడు. ప్రతీ ఉదయమూ ఆస్థాన సమయానికి వేదరాయ శర్మ మహారాజుని కలుస్తూనే ఉన్నాడు. అతని వెంటే శంభుడూ వెళతాడు.

భూషణాచార్యుడి కొడుకు వెళ్ళే సమయానికి వేదరాయ శర్మా, శంభుడూ కూడా అక్కడే ఉన్నారు. సాధారణంగా నరేంద్రగజపతి రాకుండా ఉండడు. ఆనాడు మాత్రం రాలేదు. కొంతమంది తన అంతరంగికుల్ని వేగులుగా నియమించి పంపాడు.

భూషణాచార్యుడికి విష జ్వరం వచ్చిందని తెలిసి దేవరాయలు ఆశ్చర్యపోయాడు.

"అదేవిటి? నిన్న సాయంత్రం వరకూ బాగానే వున్నారు కదా?"

"రాత్రికి రాత్రి జ్వరం వచ్చి పడింది మహారాజా! ఇప్పటివరకూ మంచం దిగలేదు. వైద్యుడికోసం కబురంపాం. రాత్రంతా మూలుగుతూనే ఉన్నారు. మీకీ విషయం తెలియ బరచమని నా చేత కబురంపారు మహారాజా! ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన ప్రయాణం చెయ్యలేనని విన్నవించుకుంటున్నారని చెప్పమన్నారు. "

భూషణాచార్యుడి కొడుకు మొహంలో ఆందోళన కనిపించింది దేవరాయలకి.

"పరవాలేదు. ముందు ఆరోగ్యం ముఖ్యం. అవసరమయితే చెప్పండి. ఆస్థాన వైద్యుల్ని పంపిస్తాం."

"ఆస్థాన వైద్యులకే కబరంపాం మహారాజా! ఈపాటికొచ్చే ఉంటారు. నేనిక శలవు తీసుకుంటాను.." అంటూ భూషణాచార్యుడి కొడుకు వెనుదిరిగాడు.

అతను వెళ్ళాక దేవరాయలు సంధిగ్ధంలో పడ్డాడు. ఒక పక్క నేహలని చూడాలన్న కోరికా, మరో పక్క ఈ అడ్డులూ. మనసులో మాటని పక్కనే ఉన్న వేదరాయశర్మతో అన్నాడు.

"భూషణాచార్యుడికి హఠాత్తుగా జ్వరం వచ్చిందట. వేదరాయశర్మగారూ ఎలాగూ మీరు వచ్చే వారం వెళతారు కాబట్టి, మీరే స్వయంగా ఆ కానుకలు తీసుకొని వెళ్ళండి. వచ్చే వారం బదులుగా రేపుకానీ, ఎల్లుండి కానీ బయల్దేరండి. మీ వెంట మా ఆస్థానంలో ఉన్న కొంతమందినిచ్చి పంపుతాను. మీ శిష్యురాలే కనుక ఆ అమ్మాయి మీ మాట కాదనదు. ఆమె నాట్యాన్నీ, సౌందర్యాన్నీ చూడాలని

మా మనసు తహ తహలాడుతోంది. వజ్ర హారాలూ, బంగారు ఆభరణాలూ, పట్టు చీరలూ కానుకలుగా తీసుకెళ్ళండి. ఈ పనికి మీరే సమర్థులు.."

వేదరాయశర్మ మౌనంగా విన్నాడు. తన మాట నేహల కాదనదని దేవరాయలు భ్రమ పడుతున్నాడు కానీ, గతంలో విజయనగరం రమ్మంటేనే రానని మొండికేసింది. నేహల మనస్తత్వం తనకి తెలుసు. అయినా ఆమె తండ్రి సురేంద్రని ఒప్పిస్తే సరి. తండ్రి మాట కాదనదు నేహల.

పక్కనే వున్న శంభుడు గురువుగారి జవాబేం చెబుతారా అని చూస్తున్నాడు.

కొంతసేపాగాక "సరే" నంటూ వేదరాయ శర్మ తలూపాడు.

పైకి సరే నన్నాడు కానీ, ఒక పక్క నేహల ఒప్పుకోదనే అనుకుంటున్నాడు. దేవరాయలు అన్ని సౌకర్యాలూ సమకూర్చుతున్నాడు తనకి. మహారాజుకి ఆ మాత్రం చెయ్యడం తన కర్తవ్యంగా భావించాడు. నేహల చిన్న పిల్ల. మంచీ, చెడూ తెలీదు. తల్లి, తండ్రులకి రాణి వాసపు వైభోగాల జీవితం తెలుసు. ఏ తండ్రయినా తన కూతురు బంగారు పల్లకీలోనే వెళ్ళాలని, మెత్తటి తివాచీలపై నడవాలనే కోరుకుంటాడు తప్ప కఠిన జీవితం కాదు. నాట్యానికి ఒప్పుకోక పోవచ్చు కానీ పెళ్ళికి కాదనరు; ముఖ్యంగా నేహల తల్లి తండ్రులు.

కొంతసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నా వేదరాయశర్మ శలవు తీసుకున్నాడు.

వెళుతూండగా వేదరాయలు పక్కకు పిలిచి ఎవరికీ వినిపించకుండా మెల్లగా చెప్పాడు.

"వేదరాయా! మీ మీదే ఈ కార్యం పెడుతున్నాను. ఆ అమ్మాయిని ఎలాగయినా ఒప్పించండి. నేను ఖచ్చితంగా వివాహం చేసుకుంటాను. నా అయిదవ రాణిగా స్వీకరిస్తానని చెప్పండి. ఈ విషయంలో మాట తప్పనని మీకు హామీ ఇస్తున్నాను. మీకెన్ని విలువైన కానుకలు కావాలో అన్నీ తీసుకెళ్ళండి. ఆమెను వివాహం చేసుకోడానికి ఒక మంచి ముహూర్తం కూడా మీరే నిర్ణయించండి. ఒక్క విషయం. ఈ సంగతి అందరికీ తెలియనివ్వద్దు. మహారాణి ఉమాదేవికి మాపై కాస్త అనుమానం వచ్చింది. మెల్లగా నేనే సర్ది చెబుతాను. ఈలోగా మీరు ఈ కార్యం నిర్వర్తించండి...మీ రుణం ఎలాగయినా తీర్చుకుంటాను."

వేదరాయశర్మ చేతులు పట్టుకుమ్మి చెప్పాడు దేవరాయలు.

"అలాగే మహారాజా! మీరు నిశ్చింతగా ఉండండి. నేహల మీకు కాబోయే రాణి. నేహలని ఒప్పించే బాధ్యత నాది..." అని శలవు తీసుకున్నాడు.

అంచంచల విశ్వాసంతో ఈ కార్యభారం తనపై పెట్టడంతో కరిగిపోయాడు.

ఎలాగైనా సరే నేహల తల్లి తండ్రులని ఒప్పించాలి. నేహల మహారాణి కావడంకంటే వారికింకేం కావాలి? తన మాట కాదనరన్న విశ్వాసంతో ముద్గల్కి వెళ్ళడానికి సమాయత్తమయ్యాడు వేదరాయశర్మ.

తన విడిదికొచ్చినా రాత్రంతా నిద్ర పట్ట లేదు. ఈ వివాహం ఎలా జరపాలా, నేహలనెలా ఒప్పించాలా అన్నదానిపైనే ఆలోచనలన్నీ తిరిగాయి.

ఈ వివాహం సజావుగా జరిగేలా చూడమని విరూపాక్షుణ్ణి శతవిధాలా వేడుకున్నాడు.

మానవ ప్రయత్నం మీద నమ్మకం సన్నగిల్లినప్పుడే దైవత్వమ్మీద ఆధారపడవలసి వస్తుంది. నమ్మకం ఉండాల్సింది దేవుడి మీద కాదు;మనుషుల మీద. వేదరాయశర్మ ప్రస్తుతం దేవుడి మీదే నమ్మకం పెట్టుకున్నాడు.

000000000000

మంచమ్మీద ఒత్తిగిల్లి పడుక్కున్న నేహలకీ నిద్ర రావడం లేదు. దేవుడి గుళ్ళో రేవన్నతో జరిపిన ముచ్చట్లే గుర్తుకొస్తున్నాయి. రేవన్న తనకోసం రాసిన జయదేవాష్టపది వస్త్రాన్ని గుండెలకి హత్తుకుంది. ఎంతో రాగయుక్తంగా రేవన్న పాడిన చరణాలని పదే పదే

మననం చేసుకుంటోంది. ఎందుకో తెలియదు. ఈ రాత్రంతా ఆమెకు ఎంతో సంతోషంగా వుంది. ఈ ఝామురి ఎప్పుడూ నిద్రపోయే తనకి కళ్ళు మూసుకున్నా నిద్ర రావడం లేదు. శీతాకాలం వెళ్ళినా ఇంకా చలి తగ్గలేదు. దాహం వేసి మంచి నీళ్ళు త్రాగుదామని మంచం మీద నుండి లేచి వంటింటి వైపుగా వెళ్ళింది. మండువాలో దీపపు ఒత్తి సన్నగిల్లినట్లనిపించి పక్కనే ఉన్న భరిణలోంచి తైలం తీసి వేసింది. వంటింటి వైపు వెళుతూండగా తల్లీ తండ్రి పడక గదినుండి మాటలు వినిపించ సాగాయి. ముఖ్యంగా తన పేరు ప్రస్తావన వచ్చేసరిగి వంటింటి వైపు వెళుతున్నదల్లా గిపోయింది. ఆ నిశిరాత్రి నిశ్శబ్దంలో తండ్రి మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"నేహల గురించి నువ్వేం దిగులు పడకు. పెళ్ళి ఎప్పుడు రాసుంటే అప్పుడు జరుగుతుంది. మంచి వరుడు కోసం నేనూ వెతుకుతున్నాను. సింధనూరులో ఉన్న మా అత్తయ్య వైపు బంధువులకి కబురంపాను. ఎవరైనా మంచి పెళ్ళి కొడుకుంటే చూడమని. అయినా నీకూ, నాకూ నచ్చడం కాదు. నేహలకి నచ్చాలి..."

"అమ్మాయి చిన్న పిల్ల. దానికీ మంచీ, చెడూ ఇంకా తెలీవు. మంచేదో, చెడ్డేదో మనమే నిర్ణయించాలి. మీరు అమ్మాయి ఇష్టానికి వదిలేయకండి.." తల్లి గొంతు మారినట్లుగా అనిపించింది.

"అదేం లేదు. నా చిట్టి తల్లి నా మాట కాదనదన్న నమ్మకం నాకుంది. చూద్దాం! తలరాత రాసినవాడు తలంబ్రాల ఘటన కూడా రాసే వుంటాడు. సమయం వచ్చినప్పుడు అదే జరుగుతుంది..

అనవసరంగా పిచ్చి ఆలోచన్లు పెట్టుకోకుండా పడుక్కో!"

తండ్రి మాటలు విన్నాక ఎంతో సంతోషం కలిగింది నేహలకి. తండ్రి తన ఇష్టా ఇష్టాల్ని గౌరవిస్తాడన్న నమ్మకం పెరిగింది. తనే మంచి సమయం చూసి రేవన్న గురించి చెప్పాలి. తన ప్రేమ గురించి విన్నవించాలి. గుక్కెడు నీళ్ళు తాగి ఒక్క ఉదుటున మంచమ్మీద వాలిపోయింది నేహల. తన స్వప్నం ఫలించే సమయం సన్నమవుతోంది. అశ్వత్థ నారాయణునికి తన విన్నపం చేరినట్లుంది. అందుకే తనూ, అమ్మా,నాన్నా అందరమూ ఒకే విషయం గురించి లోచిస్తున్నారు.

రేవన్నని తలచుకుంటే చాలు అతను కట్టిన పాటే గుర్తుకొస్తోంది.

*అలరుల గంధము శీతల వెన్నెల కలతల చెంత మదీయం..*
*మలయ పవనము హాలమై తోచగా లాలన చెందెను ఖేదనం*
*మాధవ తలపున పూవులు తాకెడి భావనలే మదిలోనా...*
*నా విరహం కనలేవా?..."*

ఎన్నిసార్లు పాడుకుందో తెలీదు. పాడిన కొద్దీ మరోసారి పాడాలన్నంత ఇష్టం పెరిగిపోతోంది.

ఇష్టమైన వ్యక్తులు ఏం చేసినా ఇంపుగానే ఉంటుంది. అందునా ప్రేమించే మనసుంటే ఈ ప్రపంచమే అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం నేహల ప్రేమ మామూలు స్థాయినుండి ఎప్పుడో గతి తప్పింది.


ఆమెకు రేవన్నే ప్రపంచం. అందులో వసించేది తనొక్కడే!

అతని నామస్మరణలోనే మునిగి తేలుతోంది. ఎప్పుడు నిద్ర పట్టిందో ఆమెకే తెలీదు.

00000000000000

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library